క్లుప్తంగా

'మిల్లుల్లోనూ ధాన్యంలో కోత'

ఖానాపూర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో కోతలు విధించిన అధికారులు, నిర్వాహకులు మరో దఫా ధాన్యాన్ని రైస్‌మిల్లుల వద్ద దోపిడీకి పాల్పడుతున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి లక్ష్మణ్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యాన్ని లారీల్లో రైస్‌మిల్లులకు తరలించే క్రమంలో కనీసం టార్పాలిన్లు కప్పడం లేదని.. వర్షం కురిస్తే అన్నదాతలు నష్టపోతారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

నూతన కలెక్టరేట్‌కు ఫైళ్లు



కొత్త భవనంలోకి ఫైళ్లను తీసుకెళ్తున్న సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: సమీకృత నూతన కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోకి వివిధ శాఖల కార్యాలయాలు తరలుతున్నాయి. పాత కలెక్టరేట్ నుంచి ఫైళ్లన్నీ కొత్త భవనాల్లోకి తరలిస్తున్నారు. పలు సెక్షన్లకు సంబంధించిన ఫైళ్లను వాహనాల్లో మంగళవారం కొత్త కలెక్టరేట్‌కు తరలించారు. మిగతా వాటిని బుధవారం తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పస్పుల వంతెన పునర్నిర్మించాలి

పెంబి: గత వర్షాకాలంలో కడెం వాగు ఉధృతికి మండలంలోని పస్పుల వంతెన కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో పాటు దోత్తి వాగుపై వంతెన నిర్మాణం, సిరిచెల్మ రోడ్డు మంజూరు కోసం పెంబి జెడ్పీటీసీ జానుబాయి.. మంగళవారం ఎంపీ సోయం బాపురావుని కలిసి మండల సమస్యలు విన్నవించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లి పీవో వరుణ్‌రెడ్డిని కలిసి పస్పుల వంతెన పున నిర్మాణం, దోత్తి వాగుపై వంతెన, సిరిచెల్మ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

పుస్తె, మెట్టెలు అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన నిరుపేద దంపతులు సట్ల నర్సవ్వ–నర్సయ్య కూతురు నందిని వివాహానికి మంత్రి ఐకేరెడ్డి వ్యక్తిగత సహాయకుడు కృష్ణంరాజు చేయూతనిచ్చాడు. మంగళవారం వారికి పసుపు, కుంకుమ, పుస్తె, మెట్టెలను అందజేశారు. శాంతినగర్ కాలనీకే చెందిన యువకుడు పుప్పాల శేఖర్ సైతం వారికి రూ.5వేలు అందజేశారు. పంబాల భీమన్న, దూడ శ్రీనివాస్, సతీష్, బీసీ రమేశ్, సంగర్తి రాజన్న, ప్రసాద్, దివాకర్, రాకేష్, రవి, శేఖర్, రాజేందర్, శంకర్ తదితరులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్కాగౌడ్, భూమేశ్, గణేశ్వర్మ, కాశీరాం ఉన్నారు.

ప్రహరీ పనులు ప్రారంభం

కుంటాల: మండలంలోని విఠాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.రెండు లక్షలు కేటాయించారు. ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్ మంగళవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గల్లపురం లక్ష్మీ రమేష్, వైస్ ఎంపీపీ మానికనవీన్, హెచ్‌ఎం సాయన్న, ఆర్‌బీఎస్ కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత, వీడీసీ చైర్మన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం

భైంసారూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముథోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు రామారావ్ పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బీజేపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ముథోల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. భైంసా మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, మిర్జాపూర్ ఎంపీటీసీ రజాక్, ఎంపీటీసీ అశోక్, నాయకులు, బాలాజీ, చక్రధర్, రామారావ్, సంజీవ్‌రావ్ సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

దరఖాస్తులు సమర్పించాలి

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తుల వారికి అందిస్తున్న రూ.లక్ష ఆర్థికసాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఆ ఫారాలను మున్సిపల్ కార్యాలయంలో అందించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19లోపు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, ఆధార్ జిరాక్స్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌కార్డు, బ్యాంక్ ఖాతా ప్రతులను సమర్పించాలని కోరారు.

కొలువే లక్ష్యంగా సన్నద్ధత

- నిరుద్యోగ అభ్యర్థులతో కుంటాల గ్రంథాలయం కళకళ
- 24 గంటలు తెరిచే ఉంటున్న లైబ్రరీ
- సద్వినియోగం చేసుకుంటున్న యువత



కుంటాల గ్రంథాలయంలో చదువుతున్న అభ్యర్థులు

కుంటాల: ప్రభుత్వం వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తుండటంతో నిరుద్యోగ అభ్యర్థులు ఈసారి ఎలాగైనా జాబ్ కొట్టాలనే లక్ష్యంతో ప్రిపరేషన్ సాగిస్తున్నారు. కొందరు హైదరాబాద్, నిర్మల్ వెళ్లి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటుండగా మరికొందరు స్థానిక గ్రంథాలయాలకు వెళ్లి చదువుతున్నారు. గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు ఉండటంతో యువత ఎక్కువ సమయం అక్కడే గడుపుతున్నారు. దిన పత్రికలతోపాటు పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని పుస్తకాలు ఉండటంతో యువత ప్రణాళిక ప్రకారం చదువుతున్నారు.

కుంటాల గ్రంథాలయంలో..

ఈసారి ఎలాగైనా కొలువు సాధించాలనే లక్ష్యంతో అభ్యర్థులు కుంటాల గ్రంథాలయానికి ఉదయం నుంచే పరుగులు తీస్తున్నారు. గతంలో 30 మంది పాఠకులకే పరిమితమైన గ్రంథాలయంలో ప్రస్తుతం 80 మంది వరకు చదువుతున్నారు. నోటిఫికేషన్ల సమయం కావడంతో మండలంలోని అంబుగామ, ఓలా, పెంచికల్ పాడ్, దౌనెల్లి గ్రామాల నుంచి కూడా చదువుకునేందుకు కుంటాలకు వస్తున్నారు.

కూలర్ ఏర్పాటు..

ఇటీవల పంచాయతీ నిధులు రూ.15 వేలతో గేటుతోపాటు విద్యుత్ సమస్య తలెత్తకుండా ఇన్వర్టర్‌ను సైతం ఏర్పాటు చేయించారు. మధ్యాహ్నం, రాత్రి అభ్యర్థులు ఇబ్బంది పడకుండా పంచాయతీ కార్యదర్శి రాజాబాపు గ్రంథాలయానికి కూలర్ వితరణ చేశారు. గ్రంథాలయ అధికారి మెంగ రాజు చల్లని తాగునీరు, సరిపడ కుర్చీలు, బల్లలు, ఫ్యాన్లు ఉంచడంతో పాఠకుల సంఖ్య పెరుగుతోంది.

అందుబాటులో స్టడీ మెటీరియల్..

గ్రంథాలయానికి వచ్చే పాఠకుల కోసం అవసరమయ్యే స్టడీ మెటీరియల్ సైతం అందుబాటులో ఉంచారు. దినపత్రికలతోపాటు గ్రూప్–1, గురుకుల టీజీటీ, పీజీటీ, పీడీ, లైబ్రేరియన్ సైన్సు, జూనియర్ లెక్చరర్, పోలీస్ పోస్టులకు సన్నద్ధమయ్యేందుకు పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం తెలుగు, ఇంగ్లీష్ దినపత్రికలు–08, మాసపత్రికలు–08, పక్ష పత్రికలు–02, వార పత్రికలు–02 విద్యార్థుల మేధస్సు పెంచే పుస్తకాలు ఉంచడంతో గ్రంథాలయానికి వచ్చి పఠనం చేస్తున్నారు.

మరిన్ని వసతులు కల్పించాలి



గతంలో నేను వ్యాపారం చేసుకునేవాడిని. ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయడంతో రోజు స్నేహితులతో గ్రంథాలయానికి వచ్చి చదువుతున్నా. మరిన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

– ఎనుగందుల సాగర్, కుంటాల

ఉద్యోగం సాధిస్తా



గతంలో పట్టణాలకు వెళ్లి కోచింగ్ తీసుకునేవాళ్లం. ప్రస్తుతం కుంటాల గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు ఉండటంతో బాధలు తీరాయి. బాగా చదివి ఉద్యోగం సాధించి అందరి పేరు నిలబెడుతా.

–ప్రవీణ్, కుంటాల

ఇబ్బందులు రానివ్వం

పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతున్నాం. నిత్యం పాఠకులతో గ్రంథాలయం సందడిగా మారుతోంది. వేసవి నేపథ్యంలో తాగునీరు, ఫ్యాన్లు వంటి సౌకర్యాలు కల్పించాం. 24 గంటలు తెరిచే ఉంటుంది. అభ్యర్థులకు ఇబ్బంది రానివ్వం.

– మెంగ రాజు, గ్రంథాలయాధికారి, కుంటాల

అటెన్షన్ ప్లీజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయరూ..



లక్ష్మణచాంద: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పీచర, రాచాపూర్ గ్రామాల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వంగిపోయి ప్రమాదకరంగా మారింది. నెల రోజులు దాటినా విద్యుత్ అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. వెంటనే సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: మహేశ్, ఏఈ, లక్ష్మణచాంద, ఫోన్: 94408 11706

ఆధునిక పద్ధతుల్లో సాగుచేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఈవో రాజ్‌కుమార్

పెంబి: రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేసి లాభాలు పొందాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పస్పుల గ్రామంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ.. ఇటిక్యాల క్లస్టర్ పరిధిలో అధిక సాంద్రత విధానంలో ఎకరాకు 25 వేల మొక్కలు విత్తుకునేలా పత్తి పంట సాగు చేస్తే మంచి ఆదాయం సాధించవచ్చన్నారు. రెండో పంటగా మొక్కజొన్న, నువ్వుల పంటలు వేసుకోవచ్చన్నారు. ఉపసర్పంచ్ సహదేవ్, మహేందర్, కార్యదర్శి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారానికి సాయన్న ఎంపిక

నిర్మల్‌ఖిల్లా: ఇప్పటివరకు 66సార్లు రక్తదానం చేయడంతోపాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నందుకు జిల్లా కేంద్రానికి చెందిన యాటకారి సాయన్నకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. ఈనెల 14న అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాకు ఒకరు చొప్పున ఉత్తమ రక్తదాతలుగా ఎంపిక చేసి వారికి గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ అధ్యక్షులు తమిళిసై చేతుల మీదుగా హైదరాబాద్ రాజ్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో అవార్డు ప్రదానం చేయనున్నారు. నిర్మల్ జిల్లా నుంచి ఎంపికైన ఎటకారి సాయన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే రేఖానాయక్



మహిళా సంఘాలకు మంజూరైన రుణాల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: ఆడబిడ్డలకు అండగా ఉండి స్త్రీ, శిశు, మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. న్యూట్రిషన్‌కిట్, ఆరోగ్యలక్ష్మి, కల్యాణలక్ష్మి, అమ్మఒడి, షీటీం వంటి పథకాలతో మహిళలకు రక్షణగా ప్రభుత్వం ఉంటుదన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్, స్థానిక సంస్థల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం చేశారన్నారు. నీటి కోసం బిందెలతో రోడ్డెక్కకుండా ఇంటింటికీ మిషన్ భగీరథతో జలం తెచ్చారన్నారు. అనంతరం బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.10కోట్లతోపాటు స్త్రీ నిధి ద్వారా రూ.2కోట్లతో కూడిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఎమ్మెల్యే బతుకమ్మ ఆడారు. డీఆర్‌డీవో విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ కలీల్, నాయకులు పుప్పాల శంకర్, రాజగంగన్న, జన్నారపు శంకర్, పుప్పాల స్వప్న, పరిమి లత, కావలి సంతోశ్, పరిమి సురేష్, పత్రి నాగేశ్, సీడీపీవో సరిత, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు తదితరులు ఉన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి

భైంసాటౌన్: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని దీపిక మృతిపై విచారణ జరపాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భైంసాలోని తన కార్యాలయంలో మాట్లాడారు. దీపిక మృతిని ప్రభుత్వం ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం చేస్తోందని.. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పట్టణాధ్యక్షులు మల్లేశ్, పోశెట్టి, అనిల్ తదితరులున్నారు.

భైంసారూరల్: బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు మహేందర్ అన్నారు. మంగళవారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో నాయకులు మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నవీన్, లక్ష్మణ్, విశాల్ తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని అనుమానాస్పద మృతిపై విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులు నవీన్ మంగళవారం భైంసాలో మాట్లాడారు. విచారణ జరపకుంటే జిల్లా బంద్‌కు పిలుపునిస్తామన్నారు. ముథోల్ పరమేశ్, యోగేశ్, కిరణ్, అజయ్ ఉన్నారు.

ఖానాపూర్: ప్రభుత్వ వైఫల్యంతోనే బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని వైఎస్సార్‌టీపీ యూత్ మండల అధ్యక్షులు ఎగుర్ల మహేశ్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఘటనకు నైతిక బాధ్యతగా డైరెక్టర్, వీసీలను పదవుల నుంచి తొలగించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన గట్ల ప్రమోద్ కుమార్ తండ్రి వెంకటేష్ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకోగా మంగళవారం బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య జాన్సన్‌నాయక్ బాధితుడిని పరామర్శించారు. హైదరాబాద్‌లో ఆపరేషన్ అయ్యేందుకు కృషి చేసిన జాన్సన్‌నాయక్‌కు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలేరి దివాకర్, బలగం రమేశ్, సాడిగె ప్రసాద్, సల్ల వంశీ, సాబీర్, గాజుల అజయ్, చిలివేరి గంగసాగర్ తదితరులు ఉన్నారు.

అంబారిపేట్‌లో..

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య జాన్సన్ నాయక్ పర్యటించారు. ప్రమాదంలో గాయపడిన కొప్పుల లచ్చన్న, అనారోగ్యంతో బాధపడుతున్న గంగన్నతోపాటు ఇటీవల మరణించిన నర్సయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీకాంత్‌యాదవ్, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అప్పాల గణేశ్ చక్రవర్తి నియమితులయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మల్లికార్జున్ రెడ్డిని సన్మానించారు. తనపై నమ్మకంతో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్, జిల్లా అధ్యక్షురాలు రమాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసిమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు శ్రావణ్‌రెడ్డి, మిట్టపల్లి రాజేందర్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజని వైద్య, అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, బీజేవైఎం రాష్ట్ర స్టడీ సర్కిల్ కన్వీనర్ కుమ్మరి వెంకటేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రావణ్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే మోసాలకు అడ్డుకట్ట

భైంసాటౌన్: ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉంటేనే మోసాల బారిన పడకుండా ఉంటామని యూబీఐ రీజినల్ హెడ్ శంకర్ హెంబ్రం అన్నారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం యూబీఐ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో జన్‌సురక్ష, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంకులు అందిస్తున్న బీమా ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మోసపూరిత కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. అనంతరం పలువురు మహిళా సంఘ సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, యూబీఐ డీజీఎం దామోదర్, చీఫ్ మేనేజర్ ప్రశాంత్, మెప్మా సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండాలో బుధవారం శ్రీజగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్, రామ్‌రావ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ యశోదబాయి ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు హాజరుకావాలని వారు కోరారు.

మహిళల సంక్షేమానికే అధిక ప్రాధాన్యం

- దశాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



మహిళా సంఘాలకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలనే ఉద్దేశంతో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి కింద పౌష్టికాహారం అందిస్తున్నామని.. జిల్లాకు 130 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపిస్తే 50 మంజూరైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అంతకుముందు బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్, కుభీర్ జెడ్పీటీసీ అల్కాతాయి మాట్లాడుతూ జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సొంత భవనాల మంజూరుకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరగా వారు సానుకూలంగా స్పందిస్తూ నిధుల మంజూరుకు ప్రతిపాదిస్తానన్నారు. అనంతరం మహిళా ప్రగతి జిల్లా సమాఖ్యకు రూ.15కోట్లు, మహిళా ప్రగతి జిల్లా సమాఖ్య ముథోల్ క్లస్టర్‌కు రూ.కోటి చెక్కులను అందించారు. నోడల్ అధికారి, జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ సాగరబాయి, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, ఎంపీడీవోలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఐకేపీ వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ ఎస్సీ సంక్షేమ బాలుర వసతిగృహంలో 85 సీట్లు ఖాళీగా ఉన్నాయని.. మూడు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంక్షేమాధికారి ఎ.భాస్కర్ అన్నారు. మంగళవారం ఖానాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బోనఫైడ్, టీసీ, ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాలతో పాటు 4పాస్ ఫొటోలు అందజేయాలన్నారు. వివరాలకు 81790 60167లో సంప్రదించాలని కోరారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

ముథోల్: ముథోల్ మండల రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు ఉంచినట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఏపీ ఐపీఎల్ ధర రూ.1350, ఐపీఎల్ 20–20 రూ.1120, సూపర్ ఎస్ఎస్‌పీ రూ.500, పొరీలు 15కేజీ–24 రూ.2400, వడ్లు 25కేజీ–1010 రూ.883గా ధరలు ఉన్నాయని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలోని పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థుల నుంచి పద్మశాలి ప్రతిభా పురస్కారం–2023 కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలక రమణ తెలిపారు. 2022–2023 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్, ఐఐటీ, నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలి విద్యార్థులు ఈ పురస్కారానికి అర్హులని పేర్కొన్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 94901 36717, 94417 28535 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

అట్టహాసంగా కల్యాణోత్సవం



కల్యాణంలో పాల్గొన్న శోభారాణి, నాయకులు



మామడలో బోనాలతో భక్తులు

నిర్మల్‌రూరల్: మండలంలోని అక్కాపూర్ గ్రామ సమీపంలోని ఈతవనంలో నిర్మించిన శ్రీశ్రీశ్రీ రేణుకామాత పుట్ట ఎల్లమ్మ కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. నాలుగు రోజుల పాటు వివిధ పూజలు నిర్వహించి చివరిరోజు అమ్మవారికి కల్యాణం చేశారు. నిర్మల్ గీతా పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల గౌడ కులస్తులు పాల్గొని అమ్మవారికి బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దంపతులు శోభారాణి, సత్యనారాయణగౌడ్, నాయకులు రావుల రాంనాథ్, అమరవేణి నర్సాగౌడ్, అంజు కుమార్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఇందులో గౌడ సంఘం అధ్యక్షులు లింబాగౌడ్, రాజాగౌడ్, కృష్ణమోహన్ గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, నర్సాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండల కేంద్రంలో మంగళవారం ఎల్లమ్మ బోనాల పండుగ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హన్మగౌడ్, ఉపసర్పంచ్ కళావతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనతో లాభాలు



ఉపాధ్యాయులకు బోధిస్తున్న శిక్షకులు

నిర్మల్ రూరల్: డిజిటల్ బోధనతో విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందని డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మన ఊరు–మనబడి కింద ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోధనపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. జిల్లాలో మన ఊరు–మనబడి కింద ఎంపికైన 72 ఉన్నత పాఠశాలల్లో ఈ సంవత్సరం నుంచే ప్రభుత్వం డిజిటల్ బోధన చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఎంపికైన పాఠశాలల్లో 75 ఇంచుల ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ టీవీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీటిని ఎలా ఉపయోగించాలి.. వీటి ద్వారా ఏయే విషయాలు బోధించవచ్చు.. అనే అంశాలను శిక్షకులు ఉపాధ్యాయులకు వివరించారు. ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు అర్థవంతంగా బోధించాలని డీఈవో సూచించారు. సెక్టోరియల్ అధికారులు ప్రవీణ్‌కుమార్, రాజేశ్వర్, లింబాద్రి, రిసోర్స్ పర్సన్స్ నారాయణవర్మ, దేవేందర్, ప్రమోద్, సుదర్శన్, సెల్ కాన్ కంపెనీ జిల్లా ఇన్‌చార్జి లక్ష్మణ్, ఎల్జీ కంపెనీ ట్రైనర్ ప్రకాశ్, 92 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీ నేతలవి అసత్య ఆరోపణలు'

ఖానాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరోపణలు మానుకొని ఆధారాలుంటే రుజువు చేయాలని కోరారు. ఖానాపూర్ పంచాయతీగా ఉన్నప్పుడే రూ.12లక్షలతో ఈజీఎస్ ద్వారా షెడ్లు నిర్మాణ పనులు చేపట్టారన్నారు. 202 2లో గోదావరి ఉధృతికి రేకులషెడ్డు దెబ్బతిందన్నారు. ఏడాది కిందట దెబ్బతిన్న షెడ్‌ను చూపిస్తూ నాణ్యత లోపించిందనడం సరికాదన్నారు. వైకుంఠధామం వద్ద పనుల్లో స్థానిక కౌన్సిలర్ అయిన బీజేపీ నాయకులే రూ.ఏడు లక్షలతో పంచాయతీరాజ్‌లో గైడ్‌వాల్ పనులు చేపట్టారన్నారు. పనుల్లో నాణ్యతలోపం లేదని.. క్వాలిటీకంట్రోల్‌తో విచారణ చేయించాలన్నారు. నిబంధనల మేరకే అధికారులు రూ.62 లక్షల బిల్లులు చెల్లించారన్నారు. సమావేశంలో బండారి కిశోర్ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ : జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899